క్లుప్తంగా

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం జయమాలిని

కొందుర్గు: ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని ఏపీఎం జయమాలిని అన్నారు. సోమవారం కొందుర్గు మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి మహిళా పొదుపులు, అప్పులు సకాలంలో చెల్లించి సహకరించాలన్నారు. స్వయం ఉపాధి వైపు అందరూ అడుగులు వేయాలన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది సరళ, లక్ష్య, సమాఖ్య సభ్యులు వీరమణి, అపర్ణ, భారతమ్మ, సత్యమ్మ, పుష్పాంజలి, అనిత, కవిత పాల్గొన్నారు.

సంతకాలతో ముగిసిన మండల సమావేశం

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పోతురాజు జంగయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సంతకాలతో ముగిసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరై ఎలాంటి చర్చలు, తీర్మానాలు చేయకుండా సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, ఎంపీటీసీలు రామ్‌రెడ్డి, ఇస్తారమ్మ, మంజుల, ఎంపీడీఓ ఆంజనేయులు, సీడీపీఓ నాగమణి, ఎంపీఓ లాలయ్య పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలం

కొందుర్గు: కొందుర్గు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను మూడు సంవత్సరాల పాటు సాగు చేసుకోవడం కోసం ఈ నెల 26న వేలం వేయనున్నట్లు ఈఓ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదానికి ఆసక్తి గల రైతులు రూ.2వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రమేశ్

కొత్తూరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన మంగళి రమేశ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం మండలంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించినందుకు సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

కేశంపేటకు రఘురాంగౌడ్

కేశంపేట: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన రొల్లు రఘురాంగౌడ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి సోమవారం మండల అధ్యక్షుడికి నియమాకపత్రం అందించారు. ఈ సందర్భంగా రఘురాంగౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఎంపీ రంజిత్‌రెడ్డిది అవకాశవాద రాజకీయం

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి

మొయినాబాద్: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అవకాశవాద రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చిడిగిద్ద కృష్ణారెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం రాజకీయాలతో సంబంధం లేని రంజిత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తీసుకొచ్చి చేవెళ్ల ఎంపీని చేశారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు రంజిత్‌రెడ్డి రియల్‌ఎస్టేట్, ఇతర వ్యాపారాలతో వేలకోట్లు సంపాదించుకున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆస్తులను కాపాడుకోవడం కోసం అధికార యావతో కాంగ్రెస్‌లో చేరారన్నారు. రాజకీయ జీవితాన్నిచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని రంజిత్‌రెడ్డి వదిలివెళ్లడం ఆయన అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు.

అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఎన్నిక

నందిగామ: మండల కేంద్రంలో అంబేడ్కర్ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా తుప్పుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా చెన్నగళ్ళ సందీప్, కోశాధికారులుగా మధు, కిరణ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజు, సంయుక్త కార్యదర్శులుగా కృష్ణ, రమేశ్, కరుణాకర్, సంపత్, బాబులను ఎన్నుకున్నారు.

నాయీబ్రాహ్మణ కార్యవర్గం

నందిగామ: మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్, సభ్యులుగా రాములు, రమేశ్, మిట్టు, మల్లేశ్‌లను ఎన్నుకున్నారు.

పడకేసిన పశువైద్యం

- మండలంలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశుపోషకులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



తాళ్లపల్లిలో సిబ్బంది లేక మూతపడిన పశువైద్య ఉపకేంద్రం

షాబాద్: మండలంలో పశువైద్యం పడకేసింది. సిబ్బంది కొరత కారణంగా మూగజీవాలకు సరైన వైద్యం అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పశువులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. పశువులు, గొర్రెలకు రోగాలు వస్తే చికిత్స ఎలా చేయించాలో తెలియక గొర్రెల కాపరులు, పాడి రైతులు అయోమయం అవుతున్నారు. కొన్ని పశువైద్య శాలల్లో డాక్టర్లే లేరు. పలుచోట్ల ఒకరు, ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో పశుపోషణపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 2 పశువైద్య కేంద్రాలు, 6 ఉప కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 14,046 పశువులు ఉండగా, 67,146 గొర్రెలు, మేకలు ఉన్నాయి. అదే విధంగా 15,112 కోళ్లు ఉన్నాయి. వీటన్నింటికీ పశువైద్య సిబ్బంది ఆరు నెలలకోసారి ఏడాదికి రెండు సార్లు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాల్సి ఉంటుంది. అదే విధంగా గొంతువాపు, జబ్బవాపు, పార్శురోగం, చిటిక వ్యాధులకు టీకాలను అందివ్వాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా పశుపోషకులు పశువులు, గొర్రెలకు రోగాలు వస్తే ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

విధుల్లో ఇద్దరు డాక్టర్లు

మండలంలో షాబాద్ డాక్టర్ స్రవంతి, రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా తాళ్ళపల్లి, చందనవెల్లి, పోతుగల్, మాచన్‌పల్లి, బోడంపహాడ్, సర్దార్‌నగర్ పశువైద్య ఉప కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉండటంతో ఆయా గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నా.. లేనట్టేనని ఆయా గ్రామాల రైతులు, గొర్రెల కాపరులు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది లేక పశువైద్య కేంద్రాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లోని పాడి పశువులు, గొర్రెలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సొంత భవనాలను నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించినా వైద్యులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. సిబ్బంది కొరతతో గ్రామాల్లో రైతులు తమ పశువులకు, గొర్రెలకు ఏదైనా జబ్బు చేస్తే ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పశువైద్య సిబ్బందితో పాటు పదిమంది పశువైద్య సహాయకులు, మరో పందిమంది సహాయకులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే చందనవెల్లి, సర్దార్‌నగర్‌లో మాత్రమే పశువైద్య సహాయకులు ఉన్నారు. వారే అన్ని విధులు నిర్వహిస్తున్నారు. తాళ్ళపల్లి, మాచన్‌పల్లి, పోతుగల్, బోడంపహాడ్ గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాల్లో సిబ్బంది లేక మూతపడ్డాయి. షాబాద్, రేగడిదోస్వాడలో మాత్రమే ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య కేంద్రాల్లో సిబ్బందిని నియమించి పాడిపశువులు, గొర్రెలకు వైద్యసేవలు అందేలా చూడాలని పాడిరైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం



మండలంలో పశువైద్య సిబ్బంది కొరత ఉండటం వాస్తవమే. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది లేని సబ్‌సెంటర్లలో పాడి రైతులు, గొర్రెల కాపరులకు తమ సమస్యలు తెలియజేస్తే సిబ్బందిని అక్కడకు పంపించి పశువులు, గొర్రెలకు వైద్య సేవలు అందిస్తాం.

-డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రేగడిదోస్వాడ, పశువైద్యాధికారి

సిబ్బందిని నియమించాలి



పశువైద్య కేంద్రాల్లో నెలకొన్న సిబ్బంది కొరతను అధికారులు తీర్చాలి. మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. సిబ్బంది కొరతతో మూగజీవాలకు వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

-గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్

సమస్య పరిష్కరించాలి



గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి పశువైద్య కేంద్రాన్ని నిర్మించినా సిబ్బంది లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. సిబ్బంది లేకపోవడంతో ఉపకేంద్రం మూతపడటంతో పాటు పశువులు, గొర్రెలకు వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉన్నతాధికారులు సిబ్బందిని నియమించి సమస్య పరిష్కరించాలి.

-బండ నర్సింహారెడ్డి, రైతు, మన్‌మర్రి

వైభవంగా బీరప్ప ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, తదితరులు

షాబాద్: డిల్లెంపల్లెం మోత, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో సోమవారం బీరప్ప ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ ఉదయం గంపలను నెత్తిన పెట్టుకొని ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఓ వైపు మల్లన్న, భ్రమరాంభ అమ్మవార్ల కల్యాణం జరుగుతుండగానే మరోవైపు బోనాలను సిద్ధం చేశారు. సాయంత్రం మహిళలు బోనాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మాజీ సర్పంచ్‌లు తమ్మలి రవీందర్, చెన్నయ్య, అశోక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, మాజీ మద్దూరి శకుంతల పాండు, ఎంపీటీసీ గుత్తి సునితారామస్వామి ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి

కొందుర్గు: గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ నాగమణి సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయాలు ప్రతినిత్యం ఆహారంలో తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, రేవతి, శివరాణి, అంగన్‌వాడీ టీచర్ సంగీత పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

కొత్తూరు: ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లో చేపట్టవద్దని కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 167లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి కూల్చి వేయించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను చేపడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల విజయాలను గుర్తించండి



మహిళను సన్మానిస్తున్న శివకాంచనలత

మొయినాబాద్‌రూరల్: మహిళలు విజయాలు సాధించినప్పుడు వేడుకలు జరుపుకునేందుకు ముందుండాలని కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి కోనేరు శివకాంచనలత అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో మహిళల విజయాలతో వేడుకలు జరుపుకోవడానికి ఫేమ్ ఫ్లేయర్ 2కే 24 అనే పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివకాంచనలత పాల్గొని మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన అసాధారణ విజయాలు సాకారాన్ని స్మరించుకోవడంలో ముందుండాలన్నారు. అందులో భాగంగా కేఎల్ డీమ్డ్ టూబీ విశ్వవిద్యాలయంలో మొదటి స్థానంలో ఉందని ఉమెన్స్ డెవలప్‌మెంట్ సెల్ మహిళా విద్యార్థినులు, అధ్యాపకులు అంకితభావం, నైపుణ్యాలను గుర్తించి గౌరవించాలనే నిబద్ధతను సూచించారు. ఫేమ్ ఫ్లేయర్ 2కే 24ను ఉమెన్స్ ఫోరం ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఇది మహిళలకు సాధికారిత చైతన్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. మహిళలు సాధించిన విజయాలకు క్రెడిట్ ఇవ్వాలని సూచించారు. మహిళల విజయాలను గుర్తించడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో క ళాశాల ప్రిన్సిపాల్ పార్థసారధివర్మ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమ్య, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

పది పరీక్షలు అన్ని మండలాల్లో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చేవెళ్ల మండలంలోని 5 పరీక్ష కేంద్రాల్లో 710 మంది విద్యార్థులకు గాను 707 మంది విద్యార్థులు హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. మొయినాబాద్ మండలంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 1279 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. షాబాద్ మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 723 మంది విద్యార్థులకు గాను 722 మంది హాజరుకాగా ఒక్కరు గైర్హాజరయ్యారు. షాద్‌నగర్‌లో 2,312 మంది విద్యార్థులకు గాను 13 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పోలీసులు అమలు చేశారు. అరగంట ముందుగానే చాలా మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు రాశారు.



చేవెళ్ల: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



మొయినాబాద్: పెద్దమంగళారంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



షాబాద్: బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



షాద్‌నగర్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందుకు గాను సోమవారం ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందన్నారు. కేసీఆర్ చేపట్టిన విధానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంతా అస్తవ్యస్తమైందన్నారు. షాద్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం తాలుక అధ్యక్షుడు మేడిగ పెంటయ్య, మంచిరేవుల సాయికృష్ణ, గుండు నారాయణ, మల్చలం మురళీ, చంద్రశేఖర్, ఇస్నాతి శ్రీనివాస్, శ్రీశైలం, రాజగోపాల్, శంకరయ్య, పద్మారావు, విద్యాసాగర్, దివాకర్, మేడిగ శ్రీనివాస్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే శంకర్, తదితరులు

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద ఎంపీటీసీ మంగలి శ్రీశైలం సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంవద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీటీసీ మంగలి శ్రీశైలం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మాజీ సర్పంచ్ చేరిక

జిల్లేడు చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శివమొగిలియాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత సాయిలు యాదవ్‌తో పాటుగా మరో 50 నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు కావలి చంద్రయ్య, రాంచంద్రయ్య, అంజయ్య, వెంకటయ్య, రాములు, ఇబ్రహీం, యూసుఫ్, ఖాజా, యాదయ్య, కుమార్, సందీప్, సాయిలు, రాంచంద్రయ్య, రమేష్, మురళీ, యాదయ్య, వెంకటయ్య, చాంద్‌పాషా, ఫక్రుద్దీన్, తదితరులు ఉన్నారు.

పురాతన ఆలయాలను కాపాడుకోవాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల: గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలను కాపాడుకోవాలని బీజేపీ చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామంలో సోమవారం గ్రామ శివారులో ఉన్న ఈశ్వరుని బాయి దగ్గర ఉన్న సహజ బ్రహ్మసూత్ర శివాలయ నూతన ఆలయ నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో బీజేపీ నాయకుడు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు చేసిన ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణ బీజేపీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. అందుకే కేంద్రంలో ప్రధానిగా మోదీనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున్ రెడ్డి, శివకుమార్, ఆలయ ధర్మకర్త పి.లక్ష్మారెడ్డి, గ్రామస్తులు కరణ్‌జీ, రుషికేశ్‌గౌడ్, రాందేవ్, సత్యనారాయణ, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయ నిర్వాహకులతో మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, తదితరులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. తమ గ్రామంలో ఆలయాలు నిర్మించి పూజలు చేస్తే మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మాణెయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

మైసమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శోభావెంకట్‌రెడ్డి, తదితరులు

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మిక చింతన అలవర్చుకొని క్రమశిక్షణతో మెలగాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా మాజీ అధ్యక్షురాలు దారెడ్డి శోభావెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ అర్చన యాదయ్యలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో అందరి సహకారంతో నూతనంగా మైసమ్మ ఆలయ నిర్మాణ పనులకు వారు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు మంచి ఆలోచన, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి మార్గాలను ఎంచుకొని అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘ఉద్యోగిపై దాడి బాధాకరం’



కొత్తూరు: నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

కొందుర్గు: కోడేరు ఎంపీపీ కొండె రాధాసుధాకర్ రెడ్డి ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌ను చెప్పుతో కొట్టి దుర్భాషలాడిన విషయమై సోమవారం కొందుర్గు మండల పరిషత్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ లాలయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం బాధాకరమన్నారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు: విధుల్లో ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌పై దాడి చేసిన ఎంపీపీ రాధపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ సర్వీస్ అసోసియేషన్, పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కొత్తూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పలువురు సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రజాప్రతినిధులు వ్యవహరించే తీరు మారాలని ఆయన కోరారు. మరోమారు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.